క్లుప్తంగా

కోర్ సెక్టార్‌లో అద్భుత ఉద్యోగావకాశాలు

మోతడక(తాడికొండ): ఎంబడెడ్ సిస్టమ్స్ అండ్ ఐవోటీ సాఫ్ట్‌వేర్‌తో కోర్ సెక్టార్‌లో అద్భుత ఉద్యోగావకాశాలు ఉన్నాయని విశిష్ట ఇన్నోవేటర్స్ కంపెనీ సీఈవో ఎస్.సందీప్ అన్నారు. సోమవారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఐఈటీఈ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఎంబడెడ్ సిస్టమ్స్ అండ్ ఐవోటీ అనే అంశంపై 4 రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సాఫ్ట్ వేర్‌లో నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేందుకు విద్యార్థులకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టర్ బాల మురళీకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, అకడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి

తాడికొండ: ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో తాడికొండ ప్రధాన రహదారిపై దుకాణాల ఎదుట వాహనాలు నిలుపకుండా దుకాణదారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని సీఐ కె.వాసు సూచించారు. సోమవారం సాయంత్రం ప్రధాన రహదారి, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి ప్రయాణించిన ఆయన దుకాణాల ఎదుట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాజధాని అమరావతికి ఇటీవల ట్రాఫిక్ రద్దీ అధికమైందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన వారిపై జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఎస్ఐ జోజి, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ అభివృద్ధికి కృషి


ఫిరంగిపురం: సంఘం అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని పర్సన్ ఇన్‌చార్జి నిరంజన్ కుమార్ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో సోమవారం బేతపూడి వ్యవసాయ సహకార పరపతి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి నిరంజన్ కుమార్ ఏడాది ప్రణాళికను చదివి వినిపించారు. ఈఏడాది జరిగిన జమాఖర్చులు తెలియజేశారు. సంఘంలో సభ్యుడిగా కొనసాగుతున్న వారు మరణిస్తే.. వారి స్థానంలో నామినిగా చేర్చుకునేందుకు వీలుగా తీర్మానం చేశారు.

పేదలకు దోమ తెరల పంపిణీ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం రైలు గేటు వద్ద నివసిస్తున్న పేదలకు సోమవారం విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దోమ తెరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కాగితాల స్వాతి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడం ఎంత ముఖ్యమో వారి ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. దోమల వల్ల రోగాల బారిన పడకుండా దోమ తెరలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు ముల్లపూడి సుబ్బారావు, మున్నంగి ప్రమీల, కొతవరపు రాజ్యలక్ష్మి, పోలిశెట్టి దీవెనమ్మ, ట్రస్ట్ మెంబర్ తాళ్ళ చెంచిరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



మంగళగిరి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛతా హి సేవలో భాగంగా సోమవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పలు వార్డులతో పాటు ఆత్మకూరులో పచ్చదనం పరిశుభ్రత పనులు కొనసాగాయి. ఈ సందర్భంగా స్వీపింగ్ మిషన్‌తో రోడ్లను శుభ్రపరచి, డ్రెయిన్లు శుభ్రపరచారు.

వివాహిత అదృశ్యంపై కేసు

తాడికొండ: వివాహిత మిస్సింగ్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. బండారుపల్లి గ్రామానికి చెందిన కీర్తన అనే వివాహిత ఈ నెల 28న ఇంటి నుంచి కనిపించకుండా పోయింది. ఆమెకు 8 సంవత్సరాల క్రితం పలకలూరు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. భార్యభర్తల మనస్పర్థల కారణంగా గత నాలుగేళ్ల నుంచి విడిపోయి తల్లిదగ్గరే ఉంటోంది. తల్లి పొలం పనులకు వెళ్లి వచ్చి చూడగా ఇంటివద్ద ఆమె కనిపించ లేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తుండటంతో తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి జాలా సుందరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

తెనాలిఅర్బన్: అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌బీ మధుసూదనరావు, అమృతవాణి స్థానిక ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 35 ఆటోలను తనిఖీ చేశారు. రెండు ఆటోలను సీజ్ చేశారు. మరో ఆరు ఆటోలపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు లేని ఆటోలకు రూ.45 వేల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.

3 నుంచి శివాలయంలో శరన్నవరాత్రులు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం(శివాలయం)లో దసరా శరన్నవ రాత్రులు ఈ నెల 3 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ఈవో జీవీ నారాయణ తెలిపారు. ఆలయంలో సోమవారం శుభ లేఖను ఆవిష్కరించారు. వివిధ అలంకారాలలో దర్శనమివ్వనున్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే పట్టణంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులో ఉన్న కాళికా మాత ఆలయంతో పాటు పాత మంగళగిరి జాతీయ రహదారిలో ఉన్న కనకదుర్గ ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరగనున్నాయని ఆలయ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శింకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.



విద్యుత్ కాంతులీనుతున్న శివాలయం

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు

తాడేపల్లిరూరల్ : ఎన్నికల సందర్భంగా టీడీపీ ఇచ్చిన హామీల్లోని అన్ని అంశాలను అమలు చేయాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని బ్రహ్మానందపురంలో నిర్వహించిన సమావేశానికి బూరగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బ్రహ్మానందపురం, డోలాస్ నగర్‌లో ప్రాంతాల్లో ప్రభుత్వ పోరంబోకు భూముల్లో సంవత్సరాల తరబడి నివాసముంటున్న పేదలందరికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించిన ఇవ్వాలని కోరారు. అనేక మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కొత్త పెన్షన్ల కొరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వేసుపోగు శాస్త్రి, ఎమ్మల నరసింహారావు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సమగ్రంగా ఓటర్ల జాబితా



మంగళగిరి: ఓటర్ల జాబితాను సమగ్రంగా రూపొందించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈఆర్‌వో విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ ఒత్తిళ్లకు తగ్గకుండా ఓటర్లను జాబితాలను రూపొందించాలన్నారు. ఈఆర్వో విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో మరో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ షేక్ మాబు సుభాని, తాడేపల్లి, దుగ్గిరాల తహసీల్దారు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ సునీత అన్నారు. పొనుగుపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు సోమవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు మొలకెత్తిన విత్తనాలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, క్యారెట్ వంటి పదార్థాలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం తక్కువ ఖర్చుతో పోషకవిలువలతో కూడిన ఆహారం తయారీని వివరించారు. పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం ఏసమ్మ, మహిళ పోలీసు వాత్సల్య, అంగన్‌వాడీలు లక్ష్మీప్రసన్న , ఉదయలక్ష్మి, మీరాబి, విజయకుమారి, కోటమ్మ, నవరాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై సర్వే



తాడేపల్లిరూరల్ : యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఇంటింటి సర్వేను సోమవారం దుగ్గిరాల గ్రామ పరిధిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కిల్ సన్స్ నోడల్ ఏజన్సీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గణేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు యువత కోసం స్కిల్ సెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇందులో భాగంగా 200 మంది యానిమెట్లకు శిక్షణ ఇచ్చి వారితో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిజె బెన్నీ, అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో జంతువధ నిషేధం

తెనాలిఅర్బన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని తెనాలి పట్టణంలో బుధవారం జంతువధను పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని మాంసం దుకాణాలు, కబేళాలను మూసివేయాలని సూచించారు.

డబుల్ ఎంట్రీలపై రెవెన్యూ శాఖ మల్లగుల్లాలు

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: ఇసుక డబుల్ ఎంట్రీలపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో రెవెన్యూ శాఖ మల్లగుల్లాలు పడుతోంది. జిరాక్స్ బిల్లుల దందా నడిపిన వ్యక్తులు ఎవరు అని గుర్తించడం మాని, పక్క మండలాల నుంచి వచ్చిన ఒకటి రెండు జిరాక్స్‌లను ఎత్తి చూపి చేతులు దులుపుకునే పనిలో పడింది. ఇందులో భాగంగానే ఇప్పటికే డబుల్ ఎంట్రీలు వచ్చిన పలు వాహనాలను ఆన్‌లైన్‌లో బుకింగ్ నిలిపివేసి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం. కాగా అసలు నిందితులు ఎవరూ? ఇంటి దొంగలా లేక, బయటి వ్యక్తుల ప్రయేయమా? రాజకీయ జోక్యంతో ఇసుక తరలివెళ్లిందా? అనే దానిపై స్పష్టత రాలేదు. పూర్తి స్థాయి విచారణ జరిపితే కానీ ఇసుక పేరిట జరిగిన అవినీతి వ్యవహారం గుట్టురట్టుయ్యే అవకాశం లేకపోలేదు. మరోవైపు ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి వరద కారణంగా లోడింగ్ చేసుకోలేక సింగ్ నగర్, విజయవాడ పరిసర ప్రాంతాల్లోని పలు లారీల యజమానులు తమ వాహనాలు చెడిపోయిన కారణంగా స్టాక్ యార్డుకు రాలేక పోయారు. వీరందరూ ఇప్పుడు తమకు ఇసుక లోడింగ్ చేయాలని అడుగుతున్న నేపథ్యం రెవెన్యూ అధికారులు ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లోడింగ్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో వీరంతా కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. వరదల్లో తమ వాహనాలు పాడైపోతే ఇప్పుడు లోడింగ్ చేయకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే సమస్యను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం జరిగిందని వారి నిర్ణయం మేరకు మాత్రమే తదుపరి చర్యలు ఉంటాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ప్రియదర్శిని కళాశాలలో స్మార్ట్ ఇండియా హాకథాన్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చింతపూడి ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం స్మార్ట్ ఇండియా హాకథాన్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల సెక్రటరి చందు విజయలక్ష్మి, చైర్మన్ చందు రామారావు నూతన టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించుకోవాలని, అప్లికేషన్స్ అభివృద్ధిని వివరించారు. స్మార్ట్ ఇండియా హాకథాన్ కార్యక్రమంలో సుమారు 20 టీమ్‌లు పాల్గొనగా న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ చీకటి వెంకటేశ్వరరావు, డాక్టర్ కెఎల్‌విజికె మూర్తిలు వ్యవహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తాడివాక రాఘవేంద్ర విష్ణు, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, సియస్ఇహెచ్‌డియస్ సరోజని, పరిస వెంకట్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కళాశాల సెక్రటరి చందు విజయలక్ష్మి

పరిసరాల శుభ్రతను పాటించాలి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ నిర్మలా లక్ష్మీకుమారి గ్రామంలోని చెత్త సంపద కేంద్రం పరిశీలించారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా ప్రతి గ్రామంలో రోడ్లు శుభ్రంగా ఉండేలా కార్యదర్శులు చూసుకోవాలన్నారు. నీటి తొట్లను, వాటర్ ట్యాంకులు పది రోజులకోసారి సిబ్బంది చేత శుభ్రం చేయించాలన్నారు. షెడ్డులోని నాడెపు తొట్లను పరిశీలించారు, చుట్టూ ఉన్న ప్రదేశాలు శుభ్రంగా ఉండటంతో సిబ్బందిని అభినందించారు. గ్రామ సర్పంచ్ ఎం.శివకుమారి, కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, అరుణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ నిర్మలా లక్ష్మీకుమారి

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొల్లూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. సోమవారం కొల్లూరు మండలపరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ అమృతలూరు ప్రాజెక్టు పరిధిలోని మండలాల ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు వైద్య సలహాలను పాటించి బలవర్ధకమైన ఆహారాన్ని స్వీకరించడం ద్వారా పౌష్టికాహార లోపాలను నిర్మూలించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు నిర్వహించిన సీమంత కార్యక్రమంలో పాల్గొని, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ, జనసేన మండల కన్వీనర్ బొందలపాటి చలమయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

బాధితులకు చేయూత

తెనాలిరూరల్: అగ్నిప్రమాద బాధితులకు అధికారులు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు చేయూతనందించారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో బెల్లంకొండ అంకమ్మరావుకు చెందిన ఇల్లు, ఉప్పాల గోపికి చెందిన చావిడి పూర్తిగా దగ్ధమయ్యాయి. వీరికి ప్రభుత్వం తరపున బియ్యం, నిత్యావసరాలను తహసీల్దార్ గోపాలకృష్ణ సోమవారం అందజేశారు. అలానే రెడ్‌క్రాస్ సంస్థ తరపున తెనాలి కార్యదర్శి ముమ్మనేని భానుమతి పట్టాలు, సరుకులను అందజేశారు. ఉపసర్పంచ్ నాగభూషణం, మొవ్వ సత్యనారాయణ, శివయ్య బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ జానీరసూల్, కోశాధికారి శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.



మొక్కలు నాటిన కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం దత్తత గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు వలంటీర్లే తీసుకోవాలని బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ బీటీ విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి వలంటీర్ కనీసం రెండు మొక్కలైనా నాటి పెంచాలన్నారు. గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా పూలు, నీడనిచ్చే మొక్కలు నాటి, పండ్ల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.సుధామణి తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పాల్గొన్న వారిని, సమన్వయకర్తలు పి. సురేష్, జి. చంద్రశేఖర్‌లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, విద్యార్థి విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.



మెల్లెంపూడిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఉర్దూ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సోమవారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024లో నిర్వహించే డీఎస్సీలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నింటిని భర్తీ చేయడం ద్వారా ఉర్దూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో 55 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో ఒక్కటి కూడా ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో ఉర్దూ విద్యా వ్యవస్థ మనుగడకే ప్రమాదంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉర్దూ విద్యను అందుబాటులోకి తేవడంతో పాటు ఉర్దూ నిరుద్యోగ మైనార్టీ యువతలకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఉపాధి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న షేక్ సుభాని

కేఎల్‌యూ విద్యార్థినికి అభినందన

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఈసీఈ విద్యార్థిని ఆర్యని చెబోయిన ప్రపంచ క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఆ క్రీడాకారిణిని యూనివర్శిటీలో అభినందించారు. వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 23వ తేదీ వరకు ఇటలీలో జరిగిన ప్రపంచ స్కేట్ క్రీడల్లో టీం ఇండియా తరుపున ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించినట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తున్న వారికి తమ విశ్వవిద్యాలయంలో వంద శాతం ఫీజు రాయితీ ఇస్తున్నామని వివరించారు. ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, ప్రో వీసీ

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్‌లో 3 బొమ్మల సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతానగరానికి చెందిన పట్టపు నాగ సాయి శశికుమార్(27) ఆదివారం రాత్రి ప్రకాశం బ్యారేజ్ మంగళగిరి రహదారిలో ఉండవల్లి సెంటర్ నుంచి పోలకంపాడు వెళ్తున్నాడు. మంగళగిరి నుంచి వస్తున్న ఎస్కే బాజి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పట్టపు సాగసాయి శశికుమార్ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన పులి ప్రభాకర్

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన ఉర్దూ స్కూల్ విద్యార్థులు

జిల్లాస్థాయి పోటీలకు 71 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల ఎంపికల్లో పాత గుంటూరు నందివెలుగు రోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ బాలుర హైస్కూల్‌కు చెందిన 71 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో ఇదే ప్రథమం. ఈసందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.జయప్రకాష్ అభినందించారు. గత నెల 24, 26, 28వ తేదీల్లో గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం, టీజేపీఎస్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ హైస్కూళ్లలో జరిగిన క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారని ఆయన చెప్పారు. ట్రాక్, ఫీల్డ్ ఈవెంట్స్‌లలో అండర్-14 విభాగంలో 11 మంది, అండర్-17 విభాగంలో 12 మంది ఎంపికైనట్లు వివరించారు. అదే విధంగా ఇండోర్ గేమ్స్‌లలో చెస్ క్రీడలో అండర్-14 విభాగం నుంచి నలుగురు, యోగా అండర్-14 నుంచి ముగ్గురు, అండర్-17లో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14 విభాగంలో ఇద్దరు, అండర్-17 విభాగంలో మరో ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. కబడ్డీ అండర్-14 విభాగంలో ఏడుగురు, అండర్ 17 విభాగంలో ఆరుగురు, వాలీబాల్ అండర్-14లో ఇద్దరు, అండర్ 17లో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఖోఖో అండర్-14లో తొమ్మిది మంది, అండర్ 17లో 8 మంది చొప్పున ఎంపికైనట్లు వివరించారు. జిల్లా స్థాయి పోటీలకు అత్యధికంగా 71 మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచే ఎంపిక కావటం గర్వకారణమన్నారు. గతేడాది తమ విద్యార్థి బాలాజీ నాయక్ భువనేశ్వర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని తృతీయ స్థానం పొందారని తెలిపారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రజ్వల్, పీఈటీ ఆర్.శ్రీనివాసులు అభినందించారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయప్రకాష్, ఉపాధ్యాయ బృందం

గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేయించుకోవాలి

వేమూరు: గుంటూరు, కృష్ణ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడదల చేసిందని తహసీల్దారు సుశీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కోసం నవంబరు 6 వరకు ఆన్ లైన్‌లో ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకుంటామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తులు, ఇంటర్ లేదా డిప్లమా పూర్తి చేసిన వారు అర్హులని వెల్లడించారు. ఫారం 18తో పాటు ఆధార్ కార్డ్, డిగ్రీ సర్టిఫికెట్లు తప్పని సరిగా ఉండాలని వివరించారు. ఈపీబీసీ కార్డుతో జత పరిచి తహశీల్దారు కార్యాలయంలో అందజేయాలని వివరించారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితా నవంబరు 20న విడదల చేస్తామని పేర్కొన్నారు. 23న క్లెయిమ్స్ మీద అభ్యంతరాలు తీసుకుంటామన్నారు.

అద్దేపల్లి ఎస్టీ కాలనీలో ఆయుర్వేద వైద్యశిబిరం

భట్టిప్రోలు: ఏపీ ఆయూష్ శాఖ, భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి ఎస్టీ కాలనీలోని రామమందిరం ఆవరణలో ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ పి.నాగసుధ (క్రాప) వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. శిబిరంలో 136 మందిని పరీక్షించి సీజనల్, జనరల్ వ్యాధులకు సంబంధించి మందులు అందచేశారు. కాంపౌండర్ జి. విజితేంద్ర (జంపని), ఎంఎన్‌వో జి. ప్రసాదరావు, ఆశా కార్యకర్తలు కె.రమణ, ఎస్వీ రమణ, సోషల్ వర్కర్ వి.శ్రీనివాసరావు పాల్గొని వైద్య సేవలు అందించారు.

